క్లుప్తంగా

'రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం'

బోథ్: రైతుల పక్షాన బీఆర్ఎస్ ప్రభుత్వం పోరాడుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు ఎకరానికి రూ.500ల బోనస్ ఇవ్వాలన్నారు. అన్నిరకాల వడ్లను ప్రభుత్వం కొనాలన్నారు. కేవలం సన్నరకం వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమేనని మండిపడ్డారు. రైతులకు ఏ కష్టం వచ్చినా.. అండగా ఉంటామన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఎదులాపురం: సీపీఐ సీనియర్ నాయకులు అర్ధాంగి కిష్టన్న అనారోగ్యంతో ఇటీవల రిమ్స్‌లో చికిత్స కోసం అడ్మిట్ అయ్యారు. కాగా గురువారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి రిమ్స్‌కి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయనతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట నాయకులు ముడుపు నళిని రెడ్డి, కుంటాల రాములు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రామాలయం కాలనీలో నీటిఎద్దడి

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలోని రామాలయం కాలనీలో నీటిఎద్దడి నెలకొంది. గత ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలోని రెండు చేతిపంపులు పనిచేయడం లేదని, వాటికి మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదన్నారు. సొంత బోరు ఉన్న వారి ఇంటి నుంచి నీటిని తీసుకువస్తున్నామని కాలనీవాసులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చేతిపంపులకు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: ఎండల తీవ్రత నేపథ్యంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా బల్దియా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ మున్సిపాల్టీ తాగునీటి పరిశీలన ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు గురువారం పట్టణంలోని తాటిగూడ, భుక్తాపూర్, బొక్కల్‌గూడ ఎస్సీ కాలనీ, రైల్వేలైన్ ప్రాంతాల్లో పర్యటించారు. రెండు చోట్ల చేతిపంపులు చెడిపోవడంతో బల్దియా సిబ్బందితో మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించారు.

తడిసిన జొన్న పంట పరిశీలన



జొన్నపంట పరిశీలిస్తున్న బలరాం జాదవ్

బోథ్: బోథ్ మార్కెట్ యార్డులో కురిసిన వర్షానికి తడిచిన జొన్న పంటను తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జొన్న పంటను త్వరగా కొనుగోలు చేసేందుకు మరిన్ని కాంటాలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం

నేరడిగొండ: క్రీడాకారులకు తనవంతు ప్రోత్సాహం అందిస్తానని మండలంలోని కొర్టికల్ యూపీ ధాబా యజమాని అశోక్ మహరాజ్ అన్నారు. ఈనెల 18 నుంచి నేరడిగొండలో జరగనున్న నేరడిగొండ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనే స్పార్టన్ వారియర్స్ జట్టు సభ్యులకు గురువారం క్రీడా దుస్తుల కోసం రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో జట్టు కెప్టెన్ అనిల్ కుమార్, లీగ్ నిర్వాహకులు జాదవ్ పవన్ కుమార్, లఖన్, మణిరాజ్, పాండు, యోగీ, జైరాం పాల్గొన్నారు.

సీఎంను కలిసిన సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్

బోథ్: హైదరాబాద్‌లో పలు జిల్లాల కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ల అభినందన సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బత్తుల రమేశ్ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. జిల్లా కాంగ్రెస్ విషయాలపై పలు సూచనలు చేసినట్లు రమేశ్ తెలిపారు.

ప్రజల దాహం తీరేదెలా?

- కనిపించని చలివేంద్రాలు
- ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లలో నీటివసతి కరువు



సుంకిడి గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

తలమడుగు: ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందున ప్రయాణం సాగించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహం తీర్చేవారు. ముఖ్యంగా జన సంచారం ఎక్కువగా ఉండే బస్టాండ్, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రుల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. ఈఏడాది మండలంలో ఏ గ్రామంలో కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ప్రజలు వారి దాహార్తి తీర్చేందుకు వాటర్ బాటిల్ కొనుగోలు చేయాల్సిన వస్తోంది.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

ప్రభుత్వ కార్యాలయాల్లో కనీసం తాగునీటి వసతి ఏర్పాటు చేయలేదు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వందల మంది ప్రజలు వివిధ అవసరాల కోసం వస్తుంటారు. గంటల తరబడి కార్యాలయంలో పనుల కోసం నిరీక్షించాల్సి వస్తుంది. కనీసం ఆయా కార్యాలయాల్లో అధికారులు మంచినీటి వసతి కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు. బ్యాంకులు, మీసేవ కేంద్రాల్లో కూడా తాగునీటి వసతి ఏర్పాటు చేయలేదు.

ముందుకు రాని స్వచ్ఛంద సంస్థలు..

ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల సుంకిడి గ్రామంలో, తలమడుగు మండల కేంద్రంలో మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రతీ ఆదివారం వారసంత ఉండడంతో వందలాది ప్రజలు దాహార్తి తీర్చుకుంటున్నారు.

చలివేంద్రం ఏర్పాటు చేయాలి



ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అధికారులు, స్వచ్ఛంద సంస్థలు జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్ ప్రాంతాల్లో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అలాంటి ప్రాంతాల్లో చలివేంద్రం ఏర్పాటు చేయాలి.

– ఆనంద్, స్థానికుడు

వాటర్ బాటిళ్ల పంపిణీ



కోత్తూర్ గ్రామం మీదుగా నిత్యం ప్రజలు మండల కేంద్రానికి వెళ్తుంటారు. వారితో పాటు గ్రామస్తుల దాహార్తి తీర్చేందుకు కూల్ వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసి వారికి అందజేస్తున్నాను. ఇలా ప్రజల దాహార్తి తీర్చడం ఎంతో ఆనందంగా ఉంది.

– సతీష్, రైతు, కోత్తూర్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అర్బన్ మండలంలోని 11 కేవీ శాంతినగర్ ఫీడర్‌లో మరమ్మతులు, భుక్తాపూర్ సబ్‌స్టేషన్‌లోని టౌన్–3 ఫీడర్ నిర్వహణ పనుల కోసం శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయా ప్రాంత ఏఈలు ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్ ఏరియాతో పాటు, భుక్తాపూర్, భాగ్యనగర్, వడ్డెరకాలనీ, క్రాంతినగర్, హమాలీవాడ, తాటిగూడ, మహాలక్ష్మి వాడ, చిలుకూరి లక్ష్మినగర్, జై జవాన్‌నగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి ప్రాంతంలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు.

నష్టపోయిన కుటుంబాలను ఆదుకుంటాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన కుటుంబాలను ఆదుకుంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని లాల్‌టెకిడి, మారుతిగూడ గ్రామాలకు సందర్శించి ఈదురు గాలులతో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడి నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన కుటుంబాలను తక్షణమే గుర్తించి సాయం అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ సమస్య లేకుండా చూడాలని సూచించారు. అకాల వర్షం కారణంగా నష్టపోయిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ మసుద్, ముఖడే ఉత్తం, జితేందర్, కొట్నాక్ పాండు, కుమ్ర రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

కథల పుస్తకాలు చదవాలి



మాట్లాడుతున్న ఉదయశ్రీ

ఇచ్చోడ: కథలతో కూడిన పుస్తకాలు చదవడంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని రూమ్ టు రీడ్ కోఆర్డినేటర్ ఉదయశ్రీ అన్నారు. గురువారం ఇచ్చోడలో విద్యార్థులతో మాట్లాడారు. వేసవిలో సమయం వృథా చేయకుండా పఠనాభివృద్ధిని పెంపొందించడానికి రూమ్ టు రీడ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. విద్యార్థులు 040– 45209722 నంబర్‌కు ఫోన్ చేసి రోజుకు ఒక కొత్త కథ వినే అవకాశాన్ని కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్ ద్వారా తమకు నచ్చిన భాషలో కథలను చదువుకునే సౌకర్యం ఉందన్నారు. ప్రతీ గ్రామంలో సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేసి పిల్లలకు కథల గురించి వివరిస్తూ.. పిల్లల్ని భాగస్వామ్యం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ శ్యాంసుందర్, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా జవాన్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు, అధికారులు

బోథ్: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 2016లో అమరుడైన సీఆర్‌పీఎఫ్ జవాన్ సతీష్ గౌడ్ వర్ధంతిని గురువారం మండలంలోని మర్లపెల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఎనిమిదేళ్ల క్రితం మావోయిస్టుల దాడిలో మృతిచెందిన సతీష్ గౌడ్ చిత్రపటానికి కుటుంబసభ్యులు, గ్రామస్తులు, ఎస్సై రాము, రంగారెడ్డి జిల్లా సీఆర్‌పీఎఫ్ క్యాంపు ఎస్సై, జవాన్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బోథ్ ఎస్సై రాము మాట్లాడుతూ.. దేశ ప్రజల కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన సతీష్‌గౌడ్‌ను దేశప్రజలు గుర్తు పెట్టుకుంటారని అన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని దేశసేవ చేయాలని పిలుపునిచ్చారు.

పరామర్శ



పరామర్శిస్తున్న జోగు రామన్న

ఎదులాపురం: పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన మాదస్తు రాకేశ్ (ఆజాద్) ఇటీవల మృతి చెందాడు. కాగా మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న గురువారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. రాకేశ్ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని వేడుకున్నారు.

మొక్కలు కాపాడాలి

లోకేశ్వరం: నర్సరీలోని మొక్కలకు నీరందించి కాపాడాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. గురువారం మండలంలోని అబ్దుల్లాపూర్, జోహర్‌పూర్, పంచగుడి గ్రామాల్లోని నర్సరీలను ఎంపీడీవో పరిశీలించి మాట్లాడారు. పిచ్చిమొక్కలను తొలగిస్తూ.. ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరందించాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

ఉచితంగా బస్‌పాస్‌లు అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎదులాపురం: విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు అందించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు ఎర్రజి హరీశ్ డిమాండ్ చేశారు. గురువారం డిపో మేనేజర్ కల్పనను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి, అలాగే పట్టణం నుంచి మండల కేంద్రాలకు బస్సులో వెళ్లి చదువుకునే విద్యార్థులు ఉచితంగా బస్‌పాస్‌లు అందించాలన్నారు. లేదంటే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇందులో నాయకులు శ్రీకర్, శ్రీకాంత్, విశాల్, శివమణి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం




అవగాహన కల్పిస్తున్న ఎస్సై సునీల్

ఇంద్రవెల్లి: సైబర్ నేరాలపై యువతకు, ప్రజలకు అవగాహన ఉండాలని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. గురువారం మండలంలోని హర్కాపూర్ (అందుగూడ) గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులకు ఇవ్వద్దన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీ, అపరిచిత మెసేజీకి స్పందించవద్దన్నారు. కార్యక్రమంలో పోలీసు కానిస్టేబుల్ దేవిదాస్, చరణ్‌దాస్, సిబ్బంది స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

షీటీం ఆధ్వర్యంలో అవగాహన

ఎదులాపురం: పట్టణంలోని ఓసియన్ కంప్యూటర్ సెంటర్‌లో గురువారం షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. షీటీమ్ ఇన్‌చార్జి సునీత శిక్షణ కోసం వచ్చిన విద్యార్థినులకు మహిళా చట్టాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ మోసాలు గురించి వివరించారు. అత్యవసర సమయంలో 87126 59953కి కాల్ చేయాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సైబర్ నేరాల కోసం 1930, బాల్య వివాహాలకు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098లకు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థినులు, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కండువా కప్పుతున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కచ్‌కంటి గ్రామస్తులు, యువకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గూడ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం, కల్యాణ మహోత్సవం ఆహ్వాన పత్రికను గ్రామస్తుల సమక్షంలో కంది శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, ఆవుల వెంకన్న, నాయకులు సంతోష్‌రావు, దేవిదాస్ చారి, భోజారెడ్డి, సుధాకర్ గౌడ్, దీపక్‌రావు, రాజీవ్ పాల్గొన్నారు.

పంటలకు బోనస్ చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోథ్: రైతులు పండించిన పంటకు ప్రభుత్వం బోనస్ చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బోథ్ మండల కేంద్రంలో తహసీల్దార్ సుభాష్ చందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో భాగంగా ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి రైతులు పండించిన పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్‌గా, రైతుభరోసా ద్వారా ఎకరాకు రూ. 15 వేలను అందించాలని కోరారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల రైతు సంఘం అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, అల్లకొండ ప్రశాంత్, సత్యనారాయణ, సుభాష్, స్వామి, సురేశ్, లింగారెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ డెంగీ దినోత్సవం



ఆదిలాబాద్‌రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జాతీయ డెంగీ దినోత్సవం జరుపుకున్నారు. మండల వైద్యాధికారి సర్ఫ్రాజ్ మాట్లాడుతూ.. డెంగీ వ్యాధి ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ కుట్టడం వలన వస్తుందన్నారు. ఈవ్యాధి బారిన పడిన వారికి జ్వరం, తలనొప్పి, కాళ్లనొప్పులు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, వికారం, వాంతులు వచ్చినట్లు అవుతుందన్నారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే డెంగీ బారిన పడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, ఆడే సు రేశ్, కొడప యశోద, లక్ష్మీ బాయి, నల్ల ఈశ్వర్ రెడ్డి, పవర్ ప్రేమ్‌సింగ్, ఇందుబాయి, జయ, రుక్మిణి, సునీత, సుమిత్ర, అనసూయ పాల్గొన్నారు.

తాంసి: డెంగీ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కరంజి(టి) ఎంఎల్‌హెచ్‌పీ సాహితి అవగాహన కల్పించారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. డెంగీ లక్షణాలు కనిపిస్తే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఇళ్ల చుట్టుపక్కల మురికినీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వారి వెంట ఏఎన్ఎం సుజాత, సరస్వతి, రాధ, ఆశ కార్యకర్తలు లక్ష్మి, మేఘన పాల్గొన్నారు.

- తాంసి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం డెంగీ నిర్మూలనపై అవగాహన కల్పించారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యాధికారి శ్రావ్య, వైద్య సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. డెంగీ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంపత్ కుమారి, ఏఎన్ఎం లక్ష్మి, ఆశ కార్యకర్తలు ప్రభావతి, పద్మ పాల్గొన్నారు.



తాంసి: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



ఇంద్రవెల్లి: ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

ఇంద్రవెల్లి: డెంగీ ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీకాంత్ అన్నారు. గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సందీప్,హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన మే పుష్పం



నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన డాక్టర్ గంగారామ్ కుర్మే ఇంటి ఆవరణలో మే పుష్పం విరబూసింది. ఈ పువ్వులు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రకృతి ప్రియుడైన గంగారామ్ తన ఇంటి ఆవరణలో అనేక రకాల పూల మొక్కలను పెంచుతున్నాడు.

ప్రతీ కూలీకి పని కల్పించాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

నేరడిగొండ: ప్రతీ కూలీకి పని కల్పించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం మండలంలోని కుంటాల(బి) గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. పనుల ప్రదేశంలో తాగునీటి సౌకర్యంతో పాటు ఫస్ట్ ఎయిడ్‌కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం పూటనే పనులకు వెళ్లాలని సూచించారు. ఎలాంటి అవకతవకలకు ఉపాధిహామీ అధికారులు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, సిబ్బంది ఉన్నారు.